



గుమ్మందగ్గర, మోకాళ్ల మీద తల ఆన్చి కూర్చొన్నదల్లా, ఏదో నిర్ణయానికి వచ్చినదాన్లా గభాలున లేచి, గాజులు గలగలమనేలా చీరకుచ్చెళ్లు సర్దుకొంది రాజ్యలక్ష్మి.

గదిలో టేబిల్ మీద, లాంతరు వెలుగులో, లావుపాటి బైండ్ పుస్తకం చదువుతున్న లెక్చరర్ భాస్కరం దృష్టిని, ఆమె చర్యలేవీ ఆకర్షించలేకపోయాయ్.

ఆమెకి తెలుసు– తన హొయలు– వయ్యారాలు, నయాలు, అనునయాలు ఏవీ అతనిని పుస్తకంముందు నుంచి కదలించలేవని. అయినా ఆమె తన ప్రయత్నం మానదలచుకోలేదు.

పదిరోజుల నుండీ, ప్రతిరోజూ ఆమె అనుకొంటుంది. 'ఈరోజు ఎలాగైనా అతనితో మాట్లాడాలని.' కాని తొమ్మిది రోజులూ ఆమెకి 'మక్కి–ఎదురైంది.'

'అందుకే ఈ రోజు చెప్పెయ్యాలి.' గట్టిగా నిర్ణయించుకొని లేచిందామె. గది తలుపులు గభాలున మూసి, బోల్టు బిగించింది. టేబిల్ దగ్గరగా వెళ్లి, అతని ఎదురుగా ఉన్న కుర్చీని జరాల్మని లాగి, మోచేతులు రెండూ టేబిల్ మీద ఆన్చి, అరచేతుల మధ్య ముఖాన్ని ఇమిడ్చి, టేబిల్ అంచుమీదుగా వంగి, తపోభంగం చేయడానికి వచ్చిన అచ్చెరలా కూర్చొంది.

భాస్కరం ఏకాగ్రతకి ఈసారి భంగం కలిగింది. అతని దృష్టి సులోచనాల మీదుగా, పేజీ ఫ్రంట్ లైన్ నుండి ఆమెమీదికి మరలింది.

ఎర్రని చివర్లలో, విచ్చుకొన్న తెల్లకలువల్లాంటి అరచేతులని ముద్దాడవచ్చిన చందమామలా ఉంది, ఆమె ముఖం. టేబుల్ అంచు అదిమిపెట్టినందువల్ల– జాకెట్లోంచి ఉబికిన ఆమె నున్నని

వర్తులాలు, ముఖచంద్రుని చూడడానికి గూటిలోంచి బయటపడ్డ చక్రవాక మిధునాలలా ఉన్నాయి.

చిరకాలంనుండి అతనిని ఆశ్రయించి గర్వకారణమయిన చదువు సమయానికి హెచ్చరించగా సులోచనాలు సర్దుకొని, తిరిగి పుస్తకంమీదికి దృష్టి మరల్చాడు భాస్కరం.

రాజ్యలక్ష్మి విరాశతో కుర్చీ వెనక్కివాలి పైట సర్దుకొంది. వెన్నెలని మబ్బు తెరతో కప్పినట్లయింది. 'ఏమయినా సరే, ఇవాళ ఇతనితో చెప్పేయాలి' మనసుని మరోసారి హెచ్చరించి—

"ఏమండీ" అని పిలిచింది రాజ్యలక్ష్మి.

"........"

"మిమ్మల్నేనండీ!"

"ఏమిటి రాజ్యం !"

"రాత్రి పదకొండు దాటింది. మళ్లీ తెల్లారి లేచి ఎలాగూ చదువుకోవాలి. చదువు కట్టిపెట్టి పడుకోండి."

'చదువు కట్టిపెట్టి' అన్న మాటలు కర్ణకఠోరంగా వినిపించాయి భాస్కరానికి.

"నీకు నిద్దరవస్తే పడుకో రాజ్యం. నేను దీన్ని పూర్తిచేసి వస్తాను." అన్నాడు విసుగుగా.

భాస్కరానికి కోపం వచ్చిందని గ్రహించింది రాజ్యలక్ష్మి. చదువు నేమన్నా అంటే అతనికి కోపం వస్తుందని ఆమెకి తెలుసు. కారణం చదువు అతని ప్రాణం, అతని ఊపిరి. దాన్ని కట్టిపెట్టడం ఊపిరి బిగించడమే అవుతుంది. అప్పగింతల సమయంలో తండ్రి పరంధామయ్య ఆ విషయాన్ని ఆమెకి చెప్పనే చెప్పాడు. "చూడు తల్లీ ! తల్లి లేని పిల్లవని నీకు చేసిన గారాబంవల్ల ఎలాగూ చదువబ్బలేదు. ఆడపిల్లవి కాబట్టి, చదువుకన్నా సంసారం ముఖ్యమని రాజీకి వచ్చి, నిన్ను చదువుకొన్న వాడికిచ్చి పెళ్లిచేస్తున్నాను. భాస్కరం చదువరులకే చదువు చెప్పగల మేధావి. అతని తెలివితేటలు అనంతం. చదువుల సారం మధించడానికి పుట్టిన మేరువు. అందుచేత, అతని చదువుకి అంతరాయం కలిగించకుండా గుట్టుగా సంసారం చేసుకో" అని.

పరంధామయ్యగారు కూడ గొప్ప మేధావి. చదువు చెప్పడం వృత్తిగానే కాక, ధర్మంగా స్వీకరించిన మనిషి. ఉన్న ఒక్కగానొక్క పిల్ల రాజ్యలక్ష్మిని, చదువుల సరస్వతిని చేయాలని అతను చాల ప్రయత్నించారు. కాని రాజ్యలక్ష్మికి చదువు అబ్బలేదు. తను గురువేకాక తండ్రికూడ కావడమే దానికి కారణమని అనుకొన్న అతను, ఆమెని చదివించే బాధ్యతని, ప్రియశిష్యుడు భాస్కరానికి అప్పజెప్పారు.

తండ్రి చెప్పే చదువుపట్ల ఆసక్తిలేని రాజ్యం భాస్కరం చెప్పేదాంట్లో మార్పు ఉంటుందని ఆశించి, మొదట్లో కాస్త శ్రద్ధ కనపరచింది. కాని అతనుకూడ

అవే పాఠాలు, లెక్కలు మొదలెట్టడంతో విసుగెత్తి చదవడం మానుకొంది. ఆమెకి కావలసిన చదువేమిటో తెల్సుకో లేక, ఆ గురుశిష్యు లిద్దరూ కలిసి ఆమెది 'మట్టిబుర్ర' అని తీర్పుఇచ్చి చదివించడం మానేసారు. కూతురుకి చదువు రాలేదు సరే, అల్లుడైనా చదువుకొన్నవాడు కావా లని అనుకొన్నారు పరంధామయ్యగారు. మరుక్షణం వరుడిగా అతని దృష్టిలో భాస్కరమే మెదిలాడు. వెంటనే భాస్కరం మేనమామతో మాట్లాడి, సంబంధం ఖాయపరిచి ఇద్దరికీ పెళ్లి జరిపించేసారు ఆయన.

పెళ్లయి రెండేళ్లు గడిచినా, రాజ్య లక్ష్మి కాపరానికివచ్చి నెల్లాళ్లే అయింది. దానికి కారణం భాస్కరం బి.ఇడి. చదువు. ఎం.ఏ.,బి.ఇడి. చేసి లెక్చరర్‌గా స్థిరపడిన నెల్లాళ్లకే, భాస్కరం ఒక్కగా నొక్క మేనమామ కాలంచేసాడు. ఇంట్లో ఇన్ని మార్పులు జరిగాక రాజ్యలక్ష్మి భర్తతో కాపరానికి వచ్చింది.

వచ్చిన వారంరోజులకే రాజ్యం ఆ ఇంటి వాతావరణాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకొంది. ఆ ఇంటికి ఒకే ఒక పెద్ద దిక్కు అయిన భాస్కరం విధవ మేనత్త కాంతానికి, పక్కింటి మేష్టరిగారబ్బాయి శంకరంతోగల చనువు, ఆమె దృష్టికి విపరీతంగా కనిపించింది. పెద్దదిక్కు అని, ఆవిడ పెద్దదేమీ కాదు. నిజానికి భాస్కరంకన్న ఒకటి రెండేళ్లు చిన్నదే అయిఉంటుంది. ఆవిడ అతని మేన మామకి రెండో భార్య. మొదటి భార్య పోయిన చాలకాలానికి, ఇద్దరు కొడుకులు హైస్కూలు చదువులుకూడా పూర్తి చేసిన తరువాత, కాంతం అందచందాలు చూసి మనసుజారి ఆమెని వివాహం చేసుకొన్నాడట అతను. కాంతం, శంకరంల మధ్య ప్రణయం నిన్న మొన్నటిది కాదనీ, చాలకాలంనుండి జరుగుతున్న తతంగమేనని, శంకరంతో సాన్నిధ్యంకోసమే, భర్తపోయినా, తన సవతికొడుకుల దగ్గరకి వెళ్లక, ఆమె ఇక్కడే తిష్టవేసిందన్న నిజం, ఎంత మట్టిబుర్ర అయినా రాజ్యం కనిపెట్టే సింది. ఇన్నాళ్లుగా అదే ఇంటిలో మహా మేధావి అయిన తన భర్తకి ఈ విషయం తెలియకపోవడం ఆమెకి ఆశ్చర్యం కలిగించింది.

రాజ్యలక్ష్మి తన గుప్తప్రణయాన్ని పసిగట్టిందన్న విషయం కాంతానికి తెలిసి పోయింది. ఆ విషయం ఆమె భాస్క రానికి తెలియజేస్తుందేమో అన్న భయం, అనుమానం ఆమెని చుట్టుముట్టాయి. దాంతో వాళ్లిద్దరి మధ్య - 'కోల్డ్‌వార్' మొదలయింది. ఇంటికి పెద్దదిక్కుగా తనకిగల అధికారం కాంతం సద్విని యోగం చేసుకొంది. వంటపని, ఇంటి పనితో పగలంతా రాజ్యాన్ని వంటింటికే పరిమితంచేసింది. రీసెర్చివర్కులో తల మునకలైన భాస్కరం రాత్రిళ్లు రాజ్యం

ఊసు పట్టించుకోడన్న విషయం కాంతా నికి అనుభవైకవేద్యమే. ఈ విధంగా భార్యాభర్తల మధ్య ఏకాంతాన్ని భంగం చేసి, తన రహస్యప్రణయం భాస్కరం చెవికి సోకకుండా ఆమె జాగ్రత్త పడుతూ ఉంది. కాంతం జాగ్రత్త పడుతున్నకొద్దీ, రాజ్యంలో సహనం నశించింది. ఎలాగైనా భర్తకీ విషయం తెలియజేస్తే, మేధావి అయిన అతను ఆ విషయంలో ఏదో పరిష్కారం చేయగల డన్న నమ్మకంతో, పదిరోజులుగా ఆ ప్రయత్నం ప్రారంభించింది రాజ్యలక్ష్మి. కాని ఇంతవరకు అతనికీ విషయం తెలియజేయడం సాధ్యంకాలేదు.

"ఏమండీ" మళ్లీ పిలిచింది రాజ్యలక్ష్మి.

భాస్కరం విసుగుగా పుస్తకంలోంచి తలెత్తాడు.

"మీతో కొన్ని విషయాలు మాట్లాడా లండీ. కాసేపు నాకు అవకాశమిస్తే..."

"ఏ విషయం?" అని భాస్కరం అడగలేదు. అతని 'రీసెర్చి' ముందు ఏ విషయమైనా అతనికి అప్రస్తుతమే. "తరువాత మాట్లాడుకోవచ్చులే రాజ్యం. నీకు నిద్దరవస్తే వెళ్లి పడుకో" అని అన్నాడు.

తలుపు బయట చెవులప్పగించి, వారిద్దరి సంభాషణ విన్న కాంతం, 'అమ్మయ్య! ఈ రాత్రికింక ఫరవాలేదు' అని తేలికగా నిట్టూర్పు విడిచి తన గదిలోకి వెళ్లిపోయింది. ఆమెకి తెలుసు ఈ విషయం ఇంక ఎంతోకాలం దాగదని. ఏదో ఒకనాడు బయటపడక తప్పదని. శంకరాన్ని ఆమె మనస్ఫూర్తిగా ప్రేమించింది. భర్త ఎలాగూపోయాడు కనుక, శంకరంతో రహస్య ప్రణయానికి స్వస్తిచెప్పి వివాహాన్ని ఆశించడంలో తప్పేమీలేదు. కాని ఎంతో ధైర్యం మనోనిబ్బరంతో సాధించాల్సిన పని అది. ఆ పనిలో ఎవరూ తోడులేకపోవడం, తనంత తానే వ్యవహారాన్ని సెటిల్‌చేసుకోవాల్సి రావడం ఆమె దౌర్భాగ్యం. భాస్కరం చదువు, మేధస్సు సమస్యని పరిష్కరించలేవని ఆమెకి బాగా తెలుసు. పైపెచ్చు శంకరం నిరుద్యోగి. అతని కేదైనా ఉద్యోగం దొరికి, కాలు నిలద్రొక్కుకోగలిగితే గాని వివాహం సాధ్యంకాదు. భర్త తన వాటాకి వదిలి పోయిన ఆస్తితో ఎంతోకాలం గడపడం కష్టం. అందుకే ఆమె సమయంకోసం ఎదురుచూస్తోంది. ఈలోగా విషయం బయటపడి, బజారుపాలుకావడం ఆమె కిష్టంలేదు. కాని 'పులిమీద పుట్ర'లా వచ్చిన రాజ్యలక్ష్మిని తనెలా ఆపగలదు! కోపంతో ఆమె పిడికిళ్లు బిగుసు కొన్నాయి. 'రాత్రిళ్లు కూడ దాన్ని మొగుడితో ఒంటరిగా పడుకోనీయ కూడదు,' గట్టి నిర్ణయానికి వచ్చిన కాంతం గబగబా తన గదికివెళ్లి, చాప-



పడకచుట్ట పట్టుకొచ్చి, "భాస్కరం, భాస్కరం" అంటూ తలుపులు దబదబా బాదింది.

తలుపు చప్పుడువల్ల భాస్కరం చదువుకి అంతరాయం కలిగింది. అతను ఎదురుగా కూర్చొన్న రాజ్యలక్ష్మివంక చూసాడు. ఆ చూపులో, 'అత్త వచ్చింది తలుపు తియ్యి' అన్న భావం ఉంది.

రాజ్యం మనసు కోపంతో కుతకుత లాడిపోయింది. దిగ్గున కుర్చీలోంచి లేచి మంచంమీదనుండి, దుప్పటి తలగడా వేరుచేసి క్రింద పరిచింది ప్రహారాలవల్ల ఊగుతున్న తలుపులవంక చూడనైనా చూడకుండా, బలవంతంగా కళ్లు మూసుకొని పడుకొంది. కాంతం అందుకే వచ్చిందన్న సంగతి, ఆమె మట్టిబుర్ర క్షణంలో గ్రహించింది.

మేధావి అయిన భాస్కరానికి మాత్రం ఆమె చర్య అర్థంకాలేదు. విసుగుతో వెళ్లి తలుపులు తెరిచాడు అతను.

కాంతం గాలివిసురులా లోపలి కొచ్చింది. "అబ్బ! ఆ గదిలో ఒంటరిగా పడుకోలేకపోతున్నానురా భాస్కరం. నిద్రపట్టడంలేదు," అంటూ రాజ్యలక్ష్మి ప్రక్కనే తన పక్క పరచి, "నిద్ర పోతున్నావేమిటి కోడలుపిల్లా! అయినా మంచంమీద కాక క్రింద పడుకొన్నా వేమిటి" అని పలకరించింది.

రాజ్యలక్ష్మి జవాబివ్వలేదు. కాంతం

లోలోపల నవ్వుకొంటూ, "కాస్త లాంతరువత్తి తగ్గించు భాస్కరం. లైట్ వెలుగు కళ్లల్లో పడుతోంది" అని పడుకొంది.

భాస్కరం లైటు వెలుగు ఆమె మీదకి పడకుండా షేడ్ పెట్టి, పుస్తక పఠనంలో లీనమయి, ఇంట్లోని అంతర్నాటకానికి తనకి తానుగా చాటయ్యాడు.

* * *

ఒంటరిగా ఎండనపడి ఒగరుస్తూ [illegible]

"ఏమమ్మా ఇలా వచ్చావ్! అందరూ క్షేమంగా ఉన్నారు కదా!" అని ఆత్రుతతో అడిగాడు పరంధామయ్యగారు.

"అంతా క్షేమమే నాన్నా! మిమ్మల్ని చూడాలనిపించి వచ్చేసాను."

"నాకు కబురంపితే నేనే వచ్చేవాణ్ని కదమ్మా! ఇలా ఉన్నట్టుండి బయలుదేరి రావటం ఏం బాగాలేదు. భాస్కరంతో చెప్పే వచ్చావా?"

రాజ్యలక్ష్మికి ఉక్రోషం ముంచుకొచ్చింది.

"అతనితో ఎలా చెప్పేది నాన్నా! రోజుకున్న ఇరవై నాలుగు గంటలలోనూ రెండు నిమిషాలు కూడ నాతో మాట్లాడటానికి వీలుఒక్కడం లేదు. పగలంతా కాలేజి, రాత్రిళ్లు పుస్తకాలు, నా ఊసు తల్చుకోడానికి అతనికి టైమ్ ఎక్కడిది."

"అదా తల్లీ! ఏ బాధ!" పరంధామయ్యగారు పకపకా నవ్వారు. "రీసెర్చి వర్కు పూర్తయ్యేవరకు నువ్వు కాస్త ఓపికపట్టు తల్లీ! భార్యగా నువ్వా విషయంలో అతనికి చేదోడువాదోడుగా ఉండాలి. భాస్కరం ఎంత తెలివైనవాడో అంత మంచివాడు. అందుకే ఏరికోరి నిన్ను...."

తండ్రి ప్రసంగం ఇంకా కొనసాగుతుండగానే, రాజ్యలక్ష్మి లేచి వంటింట్లోకి వెళ్లి స్టౌ ముట్టించింది. తండ్రినోట, [illegible] అగదన్న విషయం ఆమెకి బాగా తెలిసినదే. భర్తతో విషయప్రస్తావన ఎలాగూ జరగడంలేదు. తండ్రికి అంతా తెలియజేసి, అతని ద్వారా భర్తకి చెప్పిస్తే బాగుంటుందనే అభిప్రాయాని కొచ్చింది ఆమె రాత్రంతా ఆలోచించి. అందుకే పనులు ముగించుకొని ఆదరాబాదరాగా వచ్చింది. కాఫీ కలిపి తండ్రి చేతికి ఒక కప్పు అందిస్తూ రంగంలోకి దిగింది రాజ్యం.

"అంతా బాగానే ఉంది గాని నాన్నా! అతని విధవ మేనత్త కాంతమ్మగారితోనే కాస్త ఇబ్బందిగా ఉంది...."

కొత్తగా కాపరానికి వెళ్లిన కూతురు, అకస్మాతుగా ఇంటికి వచ్చి, అలాంటి అభియోగాన్ని తనతో చెప్పుకొన్నప్పుడు ఏ తండ్రైనా తరచి తరచి విషయం రాబట్టి సమస్యా పరిష్కారానికి ప్రయత్నిస్తాడు. కాని వచ్చిన చిక్కల్లా పరంధామయ్యగారు కూడ మేధావి

కావడమే. కూతురు తెలివితేటలపట్ల ఏ మాత్రమూ నమ్మకంలేని మనిషి అతను.

"అదేమిటమ్మా అలా అంటావ్! చిన్నదే అయినా ఆవిడ చాల మర్యాద తెలిసిన మనిషి. నీ పెళ్లిమాటలకి వెళ్లినప్పుడు 'బాబాయిగారూ,' అని నా కాళ్లకి మొక్కి పాదధూళి తీసుకున్నప్పుడే కని పెట్టాను నేను. ఆమె భక్తిశ్రద్ధలు, వినయ విధేయతలున్నూ. పాపం చిన్న తనంలోనే వైధవ్యం వచ్చి...."

రాజ్యలక్ష్మికి ఇక అక్కడ ఉండా లన్పించలేదు. కాంతాన్ని బేషరతుగా, అంతగా తండ్రి మెచ్చుకోవడం కొలిమిలో పెట్టినట్లైంది ఆమెకి. భర్త ఎలాంటివాడో- తండ్రి కూడ అంతే. ఎదుటి మనిషి అభిప్రాయాలు అర్థంచేసు కొని, ఊహలకి విలువ ఇవ్వడం వీళ్లకి చేతకాని పని. ఆమెకి ఈ మేధావివర్గం మీదనే అసహ్యం పుట్టుకొచ్చింది.

"వెళ్లొస్తాను నాన్నా! చాలా టైమైంది. మళ్లీ ఆవిడ ఎదురుచూస్తూ ఉంటుంది." అంటూ లేచింది రాజ్యలక్ష్మి.

* * *

ఇంటికి తిరిగివచ్చిన రాజ్యం, గదిలో ఎవరివో మాటలు, నవ్వులు వినిపించి తలుపుదగ్గరే ఆగిపోయింది. లోపల కాంతం, శంకరం ఇద్దరూ ఉన్నారని తెలిసిపోయింది. తలుపుమీద చేయివేసి మెల్లగా త్రోసి లోపల గడియలేదని గ్రహించింది. పిలవాలా వద్దా అని కాసేపు తటపటాయించి, తలుపులు రెండూ గభాలున తోసి, లోపలికి దారి తీసింది.

అకస్మాత్తుగా వచ్చిన రాజ్యం రాకతో గదిలో ఇద్దరూ తడబడ్డారు. ఒకరినొకరు దూరంగా జరిగి కూర్చున్నారు. రాజ్యం అదేమీ గమనించనట్లు, ఇంటిలోపలికి వెళ్తూ, "శంకరంగారు ఎందుకు వచ్చి నట్లో" అని అన్యాపదేశంగా అడిగింది.

శంకరంలాగే అతని మాటలు కూడ తడబడ్డాయి.

"భా.... భాస్కరం మాష్టారిగురించి వచ్చానండీ! మా నాన్నగారు కొంత డబ్బు అప్పుకోసం పంపించారు. వచ్చే వారం ఉద్యోగానికి ధరావతు కట్టడానికి వెళ్లాలి."

"అలాగా! మాస్టారు ఈ టైములో ఇంట్లో ఉండడం ఎప్పుడైనా చూసారా! ఇంతకీ ఎంత మొత్తం కావాలేంటి?" తనే యజమాని అయినట్లు అన్నది రాజ్యం.

కొంత మనసు లోలోపల కుతకుత లాడిపోయింది. 'ఏమిటి ఈవాళ దీని అథారిటీ!' విస్తుపోయింది ఆమె.

"వెయ్యి రూపాయల వరకు కావా లండీ. మాస్టారిగారి దగ్గరయితే నమ్మ కంగా దొరుకుతుందని...."

"అబ్బో పెద్ద మొత్తమే! అతను వచ్చిన తరువాత మరోసారి రండి. నేను కూడ చెప్పి ఉంచుతాను. ఇంతకీ

ఉద్యోగం ఎక్కడ? ఈ ఊర్లోనా లేక బయటకిపోవాలా ?"

"తలమ్ముకొన్న తర్వాత ఎక్కడ అయితే ఏమిటండి; బయటికే పోవాలి."

"నిజమేలెండి అయినా ఊరు విడిచి బయటకి పోవడమే మంచిది. కాకపోతే అలవాటయిన ప్రాణం కాబట్టి మీకు కాస్త బాధగానే ఉంటుంది" అంటూ కాంతం వైపు జెరచూపుచూస్తూ వంటింట్లోకి వెళ్లిపోయింది రాజ్యలక్ష్మి.

ఆమె వెళ్లిన తర్వాత శంకరం కూడ లేచాడు. కాంతం అతని చెయ్యిపట్టుకొని ఆపుచేసింది.

"రాజ్యలక్ష్మికి మన సంగతి తెలిసి పోయింది శంకరం. ఇంక ఎంతోకాలం మనం ఇలా ఉండలేం. డబ్బు ధరావత్తు కట్టేస్తే నీ కెలాగూ ఉద్యోగం దొరుకు తుంది కదా. పనిలో జాయిన్అవటానికి వెళ్లేముందు, నన్ను కూడ...." ఆపై మాటలు పూర్తిచేయడానికి సిగ్గు అడ్డుపడి అతని ఛాతీమీద తల వాల్చేసింది కాంతం.

శంకరం ఆమె జుట్టు నిమురుతూ ఆలోచనలో పడ్డాడు. 'కాంతం, అందమూ– డబ్బూ రెండూ ఉన్న వితంతువు. పైగా తనంటే పడిచస్తుంది. తనకి ఉద్యోగం ఎలాగూ వస్తుంది. ఆమెని తీసుకుపోయి కాపరం పెట్టేస్తే వచ్చిన నష్టం ఏముంది. తండ్రి బాధ పడతాడు, ఇంటితో సంబంధం తెగి పోతుంది. అదీ ఒకందుకు మంచిదే, పెళ్లికాని ఇద్దరు చెల్లెళ్ల బాధ్యత నెత్తిన వేసుకోనక్కరలేదు.'

"భయపడకు డార్లింగ్! ఉద్యోగం దొరకగానే వచ్చి నిన్ను తీసుకుపోతాను. ఈలోగా విషయం బయటపడకుండా చూడు" అన్నాడు శంకరం.

• • •

"రాజ్యం! ఓ రాజ్యం!"

పెరట్లో నూతిపళ్లెంమీద గిన్నెలు తోలుతున్న రాజ్యం భర్త పిలుపువిని ఆదరాబాదరాగా గదిలోకి వెళ్లింది.

"రాజ్యం! అలమారాలో 1100/- రూ॥లు మొన్ననే తెచ్చిపెట్టాను. అవేవీ కనిపించడంలేదు."

"బాగా వెతికారా ?"

"ఆ! అలమారా అంతా క్రిందు మీదులుచేసి వెతికాను, కనిపించలేదు. నువ్వు తీసావేమోనని...." భాస్కరం మాటలు తడబడ్డాయి. అతని ముఖంలో విసుగునీ, దైన్యాన్నీ స్పష్టంగా చూడ గలిగిన రాజ్యలక్ష్మి తను కూడా అలమారా వెతకడం మొదలుపెట్టింది.

ఆమెకి తెలుసు, ఆ డబ్బుతో అతను తన రిసెర్చివర్క్ని ప్రింటింగ్ చేయ దల్చుకొన్నాడని, డబ్బుపోయినదానికన్నా తన గ్రంథం అచ్చువదేమోనన్న అను మానమే అతన్ని ఎక్కువ బాధిస్తోందని. అలమారాలో డబ్బు ఉన్న సంగతి తనకే కాదు కాంతానికి కూడా తెలుసు. ఆవిడ పొలాలమీద వచ్చిన శిస్తుబాపతు సొమ్మే



అది. శంకరం మొన్ననే వచ్చి, వెయ్యి రూపాయలు అవసరం ఉందని చెప్పాడు. ఆ డబ్బుని ఆవిడ ఈ విధంగా సద్వినియోగం చేయలేదు గద!

"ఏమండీ" పిలిచింది రాజ్యం.

"దొరికిందా" ఆతృతతో అడిగాడు భాస్కరం.

"లేదండి. ఈ విషయం మీ అత్తయ్యని ఓసారి అడిగారా."

"ఎందుకు! ఆవిడకేం తెలుస్తుంది." పుట్టెడుకోపాన్ని లోపల దిగమ్రింగుకొని నెమ్మదిగా జవాబిచ్చింది రాజ్యం. "అడగడంలో తప్పేముందండీ! ఆవిడ తీసి జాగ్రత్తచేసి ఉండవచ్చు గద!"

రాజ్యం మాటలు ఇంకా పూర్తవనేలేదు. "భాస్కరం!" అని పిలుస్తూ గది లోపలికి వచ్చింది కాంతం.

"ఏమిటత్తయ్యా!"

"నీతో ఓ మాట చెప్పాలి. ఇలా రా!" అంటూ అతని చెయ్యిపట్టుకొని లోపలకి తీసుకెళ్లింది.

'డబ్బు విషయం చెప్పడానికే అయి ఉంటుంది,' అనుకొన్న రాజ్యం, అలమరా తలుపులు తాళంవేసి నూతి దగ్గరకి దారితీసింది, తిరిగి తన పనిలో చొరబడడానికి.

* * *

"నమస్కారం మాస్టారూ!"

ఏదో ఆలోచనలో పడి పరధ్యానంగా గుమ్మందాటిన భాస్కరం ప్రక్కింటా యన పిలుపుతో ఉలిక్కిపడ్డాడు.

"నమస్కారం" రెట్టించాడు ప్రక్కింటి ముసలాయన.

"అబ్బెబ్బే! అదేంటండి. పెద్దవారు ఇలా నాకు నమస్కారం చెయ్యవచ్చా" భాస్కరం తడబడ్డాడు.

"చిన్నవాడివే అయినా, దొడ్డ మనసు బాబూ నీది! చెయ్యెత్తి మొక్కడంలో తప్పేమీలేదు. అవసరం అయినదానికన్న వందరూపాయలు ఎక్కువే వేసి ఇమ్మన్నా వట కదా మా ఆవిడతో, మా శంకరం చెప్పాడు."

"ఏ డబ్బండీ! శంకరం ఏం చెప్పాడు మీతో...."

"ఎందుకు బాబూ! అంత తెలియ నట్లుగా మాట్లాడతావ్! శంకరానికి ఉద్యోగం దొరికింది. ధరావత్తుగా వెయ్యి రూపాయలు కట్టాలి. మీ దగ్గర దొరుకు తుందేమోనని రెండురోజుల క్రిందట పంపించాను. మీ ఆవిడతో విషయం చెప్తే, మీతో మాట్లాడి ఇప్పిస్తాననన్నదట. చల్లని తల్లి! దారి ఖర్చుల నిమిత్తం వందరూపాయలు ఎక్కువే ఇమ్మన్నారు మాస్టారు అని, పదకొండు వందలు శంకరం చేతిలోపెట్టి...."

ముసలాయన మాటలు మరి వినిపించ లేదు భాస్కరానికి. వినిపించినవి కాస్త అశనిపాతంలా తగిలాయి. 'రాజ్యం, డబ్బు శంకరానికి ఎందుకిచ్చింది! కాంతం అత్తయ్య చెప్పినమాటలు నిజమే నన్నమాట! ఈ సంగతేదో ఇవాళే తేల్చు కోవాలి' కాలేజీకి అన్యమనస్కంగానే దారితీసాడు భాస్కరం.

* * *

"రాజ్యం!"


మంచినీళ్ళ మరచెంబుతో గదిలోకి వచ్చి,లోపల కాంతంపక్క కనిపించక, ఆశ్చర్యంతో భర్త ముఖంవంక చూసిన రాజ్యం, అతను బిగ్గరగా పిలిచిన పిలుపుకు అదిరిపడింది.

లాంతరు వెలుగులో భాస్కరం ముఖం కోపంతో జ్వలిస్తూంది. శరీరం చెమటలు పట్టి, చిరుకంపనతో ఊగు తోంది. పిడికిళ్ళు టేబిల్ అంచుమీద బిగుసుకొని ఉన్నాయి.

భర్తని ఈ విధంగా చూడడం రాజ్య లక్ష్మి కిదే మొదటిసారి. సహజంగానే ఆమె అడుగులు తడబడ్డాయి. మాట సన్నగిల్లింది. కళ్ళు తామరకొలను లయ్యాయి.

"ఏమండీ" అంది మెల్లగా.

ఆరోగ్యం విషయం చాల సంతృప్తికరంగా వుంటుంది!




"శంకరానికి ఆ డబ్బు నువ్వెందు కిచ్చావ్ ?"

"ఏ డబ్బండీ!" తెల్లబోతూ అడిగింది రాజ్యం. "నే నిచ్చానని ఎవరు చెప్పారు!"

"శంకరం తండ్రిగారే చెప్పారు. అవసరంకన్న వంద ఎక్కువే వేసి ఇచ్చావట. ఎందుకిచ్చావ్ ?"

"నేను శంకరానికి డబ్బు ఇవ్వడం ఏమిటండీ! మీ రెలా నమ్మారామాటలని!"

"హుం! ఎలా నమ్మాననికదూ అడుగు తున్నావ్! అవును అడగకేంచేస్తావ్! ఎన్నెన్నో అబద్ధాలు నిజాలుగా నమ్మాను. ఈనాడు ఒక నిజాన్ని నమ్మేసరికి ఎలా నమ్మానని అడగకేంచేస్తావ్ !"

"ఏమిటండీ ఈ మాటలు!" రాజ్య లక్ష్మికంఠం బొంగురుపోయింది. చెంపల మీద కన్నీరు ధారకట్టింది. చెంగుతో వాటిని తుడుచుకొంటూ అంది, "నిజం ఏమిటి! అబద్ధమేమిటి? మీ మాటలు నా కర్థంకావటంలేదు. శంకరానికి ఆ డబ్బు ఇచ్చింది నేను కాదు, మీ కాంతం అత్తయ్యే! ఏది నిజమో నన్ను చెప్ప నియ్యండి."

"రాజ్యం!" పిచ్చికోపంతో ఉరిమాడు భాస్కరం. "ఇంకా నీ కట్టుకథలు నమ్మ డానికి నేనేం మూర్ఖుణ్ణనుకొన్నావా? నీకు చదువుచెప్పే రోజుల్లోనే నీ గుణాన్ని ఆకళిసీ చూచాయగా కనిపెట్టినా అది నామీద ప్రేమ అని మోసపోయాను. రీసెర్చివర్కులోపడి కొన్నిరోజుల

పాటు నాపట్ల జరిపిన ఉపేక్షని సాకు చేసుకొని, శంకరంతో కలిసి ఈ విధంగా ఆకలి తీర్చుకొంటావనుకోలేదు. దానికి ముందు ఈ రకంగా చెల్లిస్తావని లీలగా నైనా అనుమానించలేకపోయాను. ఇంకా నువ్వు చెప్పే కట్టుకథలకి చెవులప్పగిస్తా ననుకొన్నావా! ఛీ! నీ ముఖం చూడటం పరమపాపం," పిడికిళ్లు బిగించి కుర్చీ లోంచి లేచాడు భాస్కరం.

"ఏమండీ!" మొదలునరికిన మానులా క్రిందపడి అతని రెండుకాళ్లూ గట్టిగా వాటేసుకొంది రాజ్యలక్ష్మి. దుఃఖం, అవమానం, ఉక్రోషం అన్నీ ఒక్కుమ్మడిగా చుట్టుముట్టి ఆమెని మూగదాన్ని చేసాయి.

భాస్కరం విసురుగా కాళ్లని విడిపించుకొని, గదిలోంచి బయటకి దారితీసాడు. అతని వివేకం, అతని చదువు, అతని మేధాసంపత్తి ఏదీ రాజ్యలక్ష్మి పరిస్థితిని అతనికి విడమర్చి చెప్పలేకపోయాయ్. రాజ్యం కాళ్లుపట్టుకొని రోదించడం ఆమె తప్పుని ధృవపరిచినట్లేనని నమ్మాడతను. వెంటనే గదిదాటి, వీధిదాటి, తెలియని గమ్యంవైపు, ఆవేశం నడిపించిన దిక్కు దారితీశాడు భాస్కరం.

* * *

"కాంతం! మైలవ్!" చెట్ల క్రీనీడలో, రైల్వేప్లాట్‌ఫారంమీద ఒక సిమెంటు బెంచీమీద, ఆమె పక్కగా కూర్చొని ఆమె చేతిని ముద్దాడుతూ అన్నాడు శంకరం.

"ఛ! ఏమిటిది ఇంత పబ్లిక్‌గా" చెయ్యి లాగేసుకొంది కాంతం.

"కాంతం! నువ్వు కనిపించకపోవడంతో రాజ్యలక్ష్మికి అనుమానం వచ్చి గొడవచెయ్యదు కద!"

"దానికి మన సంగతి ఆలోచించేందుకు వ్యవధిలేకుండా ఒక సమస్యని సృష్టించే వచ్చాను" అంటూ, తమని అతి దగ్గరగా దాటుకొంటూపోయిన వ్యక్తిని చూసి గతుక్కుమంది కాంతం. శంకరం కూడ ఆ వ్యక్తిని చూసాడు. అతనెవరో కాదు, భాస్కరమే!

"భాస్కరం మాస్టారు ఇక్కడకెందుకు వచ్చినట్లో! మన వరారీసంగతి బయటపడిపోలేదు కద" గాభరాతో అన్నాడు శంకరం.

"నువ్వు గాభరాపడకు శంకరం. భాస్కరం మనని చూడలేదు. నిన్నటి నుండి ఇంటికి రాకుండా పిచ్చివాడిలా తిరుగుతున్నాడు కాబోలు అతనిని ఇంటికి పంపించి వస్తాను" అంటూ శంకరం వారిస్తున్నా వినకుండా "భాస్కరం, భాస్కరం" అని పిలుస్తూ అతనికి ఎదురెళ్లింది కాంతం.

భాస్కరం ఆగి ఆమెవంక ఆశ్చర్యంతో చూసాడు, "ఏమిటత్తయ్యా! మీ రిలాగ...."

"మరేం చెయ్యమంటావ్ భాస్కరం. నువ్వు ఇల్లు విడిపెట్టడంతో, అది మరీ బరితెగించి పట్టపగలే శంకరంతో

ప్రణయం సాగిస్తోంది. అది చూడలేక, తెగతెంపులు చేసుకొని నా పెద్దకొడుకు (సవతికొడుకు) దగ్గరకి బయలుదేరాను- నేను...."

"అత్తయ్యా!" ఆ మాటలకి మధ్య లోనే అడ్డుపడ్డాడు భాస్కరం.

"ఆ శంకరం ఇంట్లోనే ఉన్నాడంటావా?"

"అవును బాబూ! ఇంట్లోనే ఉన్నాడు. అది చూడలేకే...."

"రాజ్యం!" పిచ్చిగా కేకలేసి ఇంటి వైపు పరుగుతీశాడు- భాస్కరం 'ఇంటికెళ్లి వాళ్లిద్దరినీ రెడ్ హేండెడ్‌గా పట్టుకోవాలని' కాంతం మాటలు మరి వినిపించుకోకుండా.

* * *

ఇంటికి తిరిగివచ్చిన భాస్కరానికి, రాజ్యలక్ష్మి ఊహించని పరిస్థితిలో దర్శనమిచ్చి, అప్రతిభున్ని చేసింది.

సజీవంగా, పడకగదిలో ప్రియుని బాహుబంధంలో కాదు,

-నిర్జీవంగా, దూలానికి వ్రేలాడుతూ కంఠపాశబంధంలో.

'ఏమయింది! రాజ్యం ఎందుకిలా చేసింది! తన తప్పు బయటపడిపోయిందన్న అవమానం భరించలేక ఇలా చేసిందా!' మెదడు మొద్దువారి శూన్యదృక్కులతో ఆమె శరీరం వంక చూస్తున్న భాస్కరాన్ని, సరిగా అదే సమయానికి అక్కడకి చేరిన పరంధామయ్యగారి చెయ్యి గట్టిగా తట్టి జాగృతుణ్ని చేసింది.

భాస్కరం అతనిని చూసి ఏదో చెప్పబోయాడు.

పరంధామయ్యగారు వారించి ఇలా ఓదార్చారు. "ఇందులో నీ తప్పేమీ లేదన్న సంగతి నా కర్థమయింది భాస్కరం. అది నా కడుపున చెడబుట్టింది. నన్ను, నిన్ను సర్వనాశనం చేసి తలవంపులు తెచ్చింది...."

చదువులసారం పుక్కిటబట్టిన ఆ ఇద్దరు మేధావంతులు ఒకరినొకరు ఓదార్చుకొన్నారు. చదవడమే తప్ప దాని ప్రయోజనం తెలుసుకోలేని, చదువుని వృత్తిగా తప్ప లౌకికవ్యవహారాలకి వినియోగించుకోలేని ఆ చదువులతల్లి ముద్దుబిడ్డలిద్దరూ, తమ అంచనాల కొలబద్దతో రాజ్యలక్ష్మి వెన్నపూసలాంటి వ్యక్తిత్వానికి కళంకం ఆపాదించడంతో తృప్తిపడి ఆమె భౌతికకాయాన్ని తరలించే ఏర్పాట్ల కోసం త్వరపడ్డారు.